కథా నిలయం
6053
శ్రీకాకుళం



# అమ్మకోముద్దు

రాత్రి ఒంటిగంట దాటిపోయింది...! ఊరంతా దాదాపు మూటుమణిగిపోయింది...! రోజంతా పనిపాటల్లో అలసిపోయినవాళ్లూ ఆనందంలో మునిగి తేలినవాళ్లూ వ్యాపార వ్యవహారాల్తో తలమునకలైనవాళ్లూ అందరూ నిద్రాదేవి ఒడిలోకి జారిపోతున్నారు...

ఆ వేళలో –

తన గదిలో 'డబుల్ కాట్' మీద పడుకున్న శివరామయ్యకి మాత్రం నిద్ర రావటం లేదు. అసహనంగా అటూఇటూ దొర్లుతున్నాడు. కాసేపు కళ్లు మూసుకుంటున్నాడు... మరి కాసేపు కళ్లు విప్పార్చి ఆత్రంగా– హాలువైపు చూస్తున్నాడు. అక్కణ్ణించి ఏదైనా మూలుగు వినిపిస్తుందేమోనని – చెవులు రిక్కించి వింటున్నాడు. ఆ 'డబుల్ కాట్' మీద – తన పక్కనే ఎన్నో ఏళ్లు పడుకున్న తన భార్య పార్వతమ్మ – ఇప్పుడు హాల్లో ఓ చిన్న నవ్వారు మంచం మీద పడుకుని ఉంది!

మనిషిలో ప్రాణం ఇంకా కొట్టుకుంటున్నా, నిర్జీవంగా ఉన్నట్టే కనిపిస్తోంది. దాదాపు మూడు నెలలనించీ 'బ్లడ్ క్యాన్సర్'తో బాధపడుతూ ఆస్పత్రిలో ఉన్న ఆమెను కొడుకులిద్దరూ ఆ సాయంత్రమే ఇంటికి తీసుకొచ్చారు.

శివరామయ్య పార్వతమ్మ దంపతులకు ఇద్దరే కొడుకులు! పెద్దవాడు మురళి గత పదేళ్లనించీ అమెరికా దేశంలోని అంతరిక్ష పరిశోధనా కేంద్రం 'నాసా'లో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడు. చిన్నకొడుకు మాధవ అన్నయ్య ప్రోత్సాహంతో పై చదువుల కోసం అయిదేళ్ళ క్రితమే ఆస్ట్రేలియా వెళ్లి– ఆ తర్వాత అక్కడే ఉద్యోగంలో స్థిరపడిపోయాడు. ఇద్దరికీ పెళ్ళిళ్లయిపోయాయి. పిల్లలు కూడా కలిగేరు. బాధ్యతలూ పెరిగేయి! అయినా ఇద్దరూ అంతంత దూరాల్లో ఉంటున్నా–ఇంట్లో ఉన్నట్టుగానే అమ్మా, నాన్నతో నాలుగు రోజులకొకసారైనా ఫోన్ చేసి – గంటల తరబడి మాట్లాడుతారు.

ఏడాది క్రితం వేసవి సెలవుల్లో భార్యా పిల్లలతో వచ్చిన మురళి, తల్లిదండ్రులకు ఓ 'కంప్యూటర్' కొనిచ్చి దానికి 'వెబ్ కెమేరా'ని ఏర్పాటుచేసి పెట్టాడు... వృద్ధాప్యంలోకి అడుగు పెట్టిన కారణంగా, వాళ్లకు ఎలాంటి శ్రమా కలక్కూడదన్న ఆలోచనతో ఇంటిపనులు చేసి పెట్టటానికి ఓకుర్రాణ్ణి కూడా ఏర్పాటు చేశాడు. అయితే సౌకర్యాలు సమృద్ధిగా ఉన్నంత మాత్రాన రోజులు సజావుగా గడచిపోవుకదా!

డబ్బుతో దేన్నైనా సాధించుకోవచ్చు. కానీ వృద్ధాప్యాన్ని జయించటం మాత్రం సాధ్యం కాదు. పార్వతమ్మ విషయంలో అదే జరిగింది. వయోభారంతోపాటు వైద్యానికి లొంగని అనారోగ్యం ఆమెను ఆక్రమించుకుంది!

సరిగ్గా మూడు నెలల క్రితం... ఓరోజు పొద్దున్న నిద్రలేస్తూనే రక్తం వాంతి చేసుకుంది పార్వతమ్మ. శివరామయ్య కంగారుపడిపోయాడు. పని కుర్రాడి సాయంతో ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అన్ని పరీక్షలూ చేసిన తర్వాత, ఆమెకు 'బ్లడ్ క్యాన్సర్' అని నిర్ధారణ చేసి చెప్పారు డాక్టర్లు. క్యాన్సర్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తే ప్రయోజనం ఉంటుందని సలహా ఇచ్చారు. క్షణం ఆలస్యం చేయకుండా – శివరామయ్య ఆ సలహాను పాటించాడు.

ఆస్పత్రిలో చేరిన తర్వాత తన పక్కనే దిగులుగా కూర్చుండి పోయిన భర్తను చూసి చెప్పింది పార్వతమ్మ.

"దిగులుపడకండి... వయసు మీద పడుతున్న కొద్దీ మనిషికి రోగాలూ, రొష్టులూ తప్పవ్. అయినా రోగాన్ని వెంటనే కనిపెట్టి వైద్యం చేస్తున్నారుగా! నాకు నయమైపోతుందిలెండి. మీరు ఇంటికి వెళ్లండి. ఇక్కడ నాకు సాయంగా కుర్రాడుంటాడు. అబ్బాయిలు ఫోన్ చేస్తే ఇదంతా చెప్పకండి..."

శివరామయ్య ఆమె మాటలు విని కదిలిపోయాడు...

"చెప్పకపోతే ఎలా పార్వతీ? వాళ్లొచ్చి నీ పక్కనుంటే నీకు ఇంకా త్వరగా నయమై పోతుంది" అన్నాడు.

'వద్దండీ! వాళ్లకీ విషయం తెలిస్తే కంగారు పడిపోతారు. నాకేం భయం లేదన్నానుగా. వాళ్లు రావాలంటే ఇప్పటికిపుడు సెలవు దొరకటం కష్టమవుతుంది. పైగా లక్షలకు లక్షలు విమానం టిక్కెట్లకు పొయ్యాలి. అంతకీ అవసరమైతే అప్పుడు చెప్పచ్చు..." తన కళ్లల్లో కదుల్తున్న కన్నీటిని భర్తకు కనిపించకుండా దాచుకునే ప్రయత్నం చేస్తూ ముఖాన్ని మరోవైపు తిప్పుకుందామె.

శివరామయ్య కళ్లల్లో కూడా నీళ్లు చిప్పిల్లాయి.

"అంత మాటనకు పార్వతీ! అలాంటి అవసరం రాకూడదు. నువ్వు తోడు లేకుండా నేనెలా ఉండగలననుకుంటున్నావ్?" అన్నాడు గాద్గదికంగా.

"తప్పదుకదండీ! ఏదో ఒకనాడు అందరికీ చివరి రోజంటూ వస్తుంది. అందులో ముందు వెనుకలూ తప్పవ్! నా పూజలు ఫలించి పండు ముత్తయిదువలా మీ కళ్లముందే నేను వెళ్లిపోతే అంతకంటే అదృష్టం ఇంకేం ఉంటుంది?" పార్వతమ్మ మాటల్లో ధ్వనించిన నైరాశ్యానికి శివరామయ్య గుండెలు బరువెక్కాయి.

పిల్లలతో పంచుకుంటే తప్ప ఆ బరువు తీరదనిపించింది. ఆ రాత్రే వాళ్లకు ఫోన్ చేసి చెప్పేశాడు. నాలుగోనాటికల్లా ఇద్దరు పిల్లలూ వచ్చేశారు.

పేరుకు తగినట్టు అచ్చం పార్వతీదేవిలా కళకళ లాడుతూ కనిపించే కన్నతల్లి - ఆ కళాకాంతుల్ని కోల్పోయి ఆస్పత్రి మంచానికి అతుక్కుపోయి ఉండటం చూసి వాళ్లిద్దరూ కలతపడ్డారు.

ఈ మూడు నెలలుగా ఆమెను ఒకరితర్వాత మరొకరుగా కనిపెట్టుకుని ఉండి వైద్యం చేయించారు. డబ్బుని మంచినీళ్లుగా ఖర్చుపెట్టారు.

అయినా ఫలితం లేకుండాపోయింది....!

ఆరోజు ఉదయం ఆస్పత్రిలో రౌండ్స్‌కి వచ్చిన పెద్ద డాక్టరు, పార్వతమ్మను పరీక్ష చేశాక - పరిస్థితిని పూర్తిగా అంచనా వేశాక - మురళినీ, మాధవ్‌నీ తన ఛాంబర్‌కి పిలిచి 'ఆమె బతకటం ఇక కష్ట' మన్న సంగతి చెప్పేశాడు.

"అయామ్ సారీ ఫ్రెండ్స్ ! మీ మదర్ పరిస్థితి చాలా క్రిటికల్‌గా ఉంది. ట్రీట్‌మెంట్‌కి 'రియాక్ట్' కావటం లేదు. డబ్బుకి వెనుకాడకుండా ఈ మూడు నెలల నుంచీ మీరు ముందున్నారు కనుకనే, ఆవిడ అలా మంచంమీద కొన ఊపిరితో ఉండగలిగింది. ఇక లాభం లేదు... ప్రస్తుతం ఉన్న కండిషన్ చూస్తే ఇరవైనాలుగు గంటలు గడవటం కూడా కష్టంకావచ్చు. కావల్సినవారూ, రావల్సినవారూ ఎవరైనా ఉంటే వెంటనే కబురుపెట్టండి!"- అన్నాడు.

ఆ మాటలు విన్న అన్నదమ్ములు అవాక్కయ్యారు. వాళ్ల గుండెల్లో ఒక్కసారిగా ఏదో వెలితి ఏర్పడినట్టయిపోయింది.

డెభ్బయ్యేళ్లు పైబడ్డ వయసులో, ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధితో మంచంపట్టిన తల్లి మరణించక తప్పదేమోనని వాళ్లు భయపడుతూనే ఉన్నారు. ఇప్పుడు ఆ క్షణాలు దగ్గరయ్యాయని తెలుసుకోగానే తట్టుకోలేకపోయారు.

ఆ చివరి క్షణాల్ని తమ తల్లి - తాను తిరిగిన దేవాలయంలాంటి ఇంట్లో దేవుడులాంటి తన భర్త గుండెలపై తలపెట్టుకుని - తమను కళ్లారా చూసుకుంటూ గడపాలని వాళ్లిద్దరూ కోరుకున్నారు.

అందుకే ఆమెను డిశ్చార్జ్ చేయించి - ఆ సాయంత్రమే ఆస్పత్రినించి ఇంటికి తీసుకొచ్చేశారు! ఆమె నిత్యం పూజలు చేసే దేవుడి గదికి ఎదురుగా హాల్లో మంచంవేసి - దానిపై పడుకోపెట్టారు.

అప్పుడు పార్వతమ్మ కళ్లల్లో నిజంగానే సంతృప్తి కనిపించింది. పిల్లల్ని కంటి చూపుల్తోనే ఆశీర్వదించింది. తను ఆస్పత్రిలో ఉన్న మూడు నెలలూ మనోవేదనతో నిద్రాహారాలకు

దూరమై చిక్కిశల్యమైన భర్తను చూసి బావురుమనే ఓపికలేక... వచ్చే దుఃఖాన్ని పెదవులు బిగపట్టి లోలోపలే దాచేసుకుంది.

అప్పటినించీ ఆ ఇంట్లో గాలి స్తంభించిపోయినట్టనిపించింది. అనుక్షణం బరువుగా గడుస్తోంది.

ఎవ్వరూ భోజనం చేయలేదు... ఎవరికీ నిద్ర రావటం లేదు.

"మీరు నిద్రపొండి నాన్నా! అమ్మను మేం చూసుకుంటాం" - అంటూ మురళి, మాధవ్ ఒకటికి పదిసార్లు చెప్పటంతో శివరామయ్య తన బెడ్‌రూంలోకి వచ్చి పడుకున్నాడు. అయినా నిద్రరావటంలేదు.

భార్యతో పంచుకున్న అరవై ఏళ్ల దాంపత్య జీవితంలోని జ్ఞాపకాలు శివరామయ్య 'గతం గది' తలుపులు తెరచుకుని బయటకు వస్తున్నాయి... తను పెద్దగా చదువుకోలేదు... అప్పట్లో ఇంటర్మీడియట్ పాసయి, టైపు నేర్చుకుని ఓ కంపెనీలో టైపిస్టుగా చేరాడు. ఆ కాలంలో ఆడపిల్లకి పదహారేళ్ల వయసొచ్చినా, మగపిల్లాడికి నెలజీతమిచ్చే ఉద్యోగం వచ్చినా వాళ్ల పెళ్లికి టైమొచ్చేసినట్టేనని తల్లిదండ్రులు భావించేవారు. ఆ భావనే శివరామయ్య పెళ్లికి సుముహూర్తం పెట్టించింది. కేవలం ఇరవైరెండేళ్ల వయసులోనే అతనిచేత పదహారేళ్లు కూడా నిండని పార్వతి మెడలో తాళి కట్టించింది. నాలుగేళ్ల వ్యవధిలో ఇద్దరు పిల్లలకు 'తండ్రి హోదా'ను సమకూర్చిపెట్టింది.

చాలీచాలని జీతంతో, చాలా అవసరాల్ని అణచుకుంటూ బతుకుబండిని లాక్కొచ్చాడు తను! పార్వతి పదోక్లాసు చదివి మానేసినా, లైబ్రరీ నుంచి అన్నిరకాల పుస్తకాలూ తెప్పించుకుని చదివి లోక జ్ఞానాన్ని సంపాదించుకుంది. ఆ లోకజ్ఞానంతోనే పిల్లల అవసరాలు గ్రహిస్తూ వాళ్లను పెంచి పెద్ద చేసింది. వాళ్లు పెద్ద చదువులు చదివి విదేశాలకు వెళ్లగలిగారంటే అందుకు పరోక్షంగా పార్వతే కారణమని తను అనేకసార్లు అనుకున్నాడు.

'రిసెర్చ్' చేయటానికి మురళి అమెరికా వెళ్లాల్సి వస్తే పార్వతి తన వంటిమీదున్న బంగారాన్నంతా అమ్మి డబ్బు తెచ్చిచ్చింది. విమానం టిక్కెట్టుకి డబ్బు తక్కువైతే పెళ్లిపీటలమీద మావగారు తనకు పెట్టిన వెండి కంచాన్ని కూడా అమ్మేసింది. తర్వాత ఎప్పుడో మురళి ఉద్యోగంలో స్థిరపడ్డాక చేతికి బంగారు గాజులు చేయించుకోమని ఆమె పేర వంద డాలర్లు పంపిస్తే ఆ డబ్బుతో మళ్లీ వెండి కంచంకొని తనకు 'పుట్టిన రోజు బహుమతి'గా ఇచ్చింది.

"నీ కొడుకు డాలర్లను కానుకగా నీకు పంపించాడు... వాటితో నాకెందుకు కొన్నావ్?" అంటూ దెప్పిపొడుస్తున్న ధోరణిలో అడిగేడు తను.

"నా బిడ్డలు ప్రయోజకులు కావటమే నాకు పెద్ద కానుకండీ!... ఆరోజు మా నాన్న మీకు బహుమతిగా ఇచ్చిన వెండి కంచాన్ని అమ్మింది నేనే కనక తిరిగి కొనిచ్చే బాధ్యత కూడా నేనే తీసుకున్నాను. ఆ కంచంలో మీరు భోంచేస్తే నా కడుపు కూడా నిండిపోతుందిలెండి!" అంది పార్వతి నవ్వుతూ.

ఆ నవ్వూ అప్పుడు ఆమె కళ్లల్లో కనిపించిన సంతృప్తీ తనకుఅలాగే గుర్తుండిపోయాయి!

వాటినన్నంటినీ అలా గుర్తుచేసుకుంటూనే మంచం మీద అటూఇటూ అసహనంగా కదులుతున్న శివరామయ్యకు అంతలోనే పక్కనున్న మరో బెడ్‌రూంలోంచి మాటలు వినిపించాయి.

ఆ గదిలో ఉన్న అన్నదమ్ములిద్దరూ మాట్లాడుకుంటున్నారు. –

"హాస్పిటల్ బిల్లెంతైందీ?" – మాధవ్ అడిగేడు.

"చాలానే వేశారు... మనిద్దరం ఫారిన్‌లో ఉంటున్నట్టు వాళ్లకు తెలుసుగా! అందుకే మరీ ఎక్కువగా ఛార్జ్ చేశారనిపించింది!... హాస్పిటల్ రూమ్‌కే అరవైఎనిమిది వేలు వేశారు. టెస్టులన్నింటికీ కలిపి ముప్ఫయ్ వేల దాకా చూపించారు. ట్రీట్‌మెంట్ ఖర్చులు సరేసరి!" చెప్పాడు మురళి.

"నా క్రెడిట్ కార్డు మీద నిన్న యాభైవేలు 'డ్రా' చేశాను. ఇమ్మంటావా?"

"బిల్లు పే చేసేశానుగా! ఇప్పుడింక అవసరం లేదులే! రేపోమాపో అమ్మను సాగనంపాలిగా! అప్పుడు చాలా ఖర్చవుతుంది. ఆ కార్యక్రమమంతా ఓ పెళ్లిలా జరగాలి!"

"అలాగే అన్నయ్యా! మనం తిరిగి వెళ్లేలోగా – ఇక్కడ అమ్మ పేరుమీద ఏదైనా ట్రస్టు ప్రారంభిస్తే ఎలా ఉంటుందీ?" –

"చూద్దాం !"

కొన్ని క్షణాలు ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది. ఆ తర్వాత మళ్ళీ మాధవ్ అడిగేడు–

"అమ్మ లేకుండా ఈ ఇంట్లో నాన్న ఒక్కరూ ఉండగలరంటావా?"

"ఇక్కడెందుకుంటారూ? నాతో అమెరికా తీసుకెడతాను!" – మురళి అన్నాడు.

"పోనీ, నేను తీసుకెళ్లి కొంత కాలం మా ఇంట్లో ఉంచుకోనా?"

"వద్దురా!. ఏ తండ్రైనా – పెద్ద కొడుకు దగ్గరే తన చివరి జీవితాన్ని గడపాలని కోరుకుంటాడు. అందుకే ముందు నాతో తీసుకెడతాను ఆయన కాస్త 'రిలాక్స్' అయ్యాక, నేనే తీసుకొచ్చి నీ దగ్గర దిగపెడతాను!"

"కానీ... నాన్నగారు అసలు మనతో వస్తానంటారో.. రానంటారో?" – సందేహిస్తూ అన్నాడు మాధవ్.

"అదీ పాయింటే! అమ్మతో గడిపిన క్షణాలు గుర్తు చేసుకుంటూ తన చివరి రోజులు ఈ ఇంట్లోనే గడిపేస్తానంటారేమో..?"

మళ్ళీ మరికొంతసేపు ఆ గదిలో నిశ్శబ్దం చోటుచేసుకుంది.

"పోనీ... ఓ పనిచేస్తే...?" – ఆ తర్వాత అడిగేడు మాధవ్.

"ఏమిటీ?"

"కొంతకాలం నేను 'ఫ్యామ్లీ'తో ఇక్కడే ఉండిపోతాను. మాతోటీ, పిల్లలతోటీ కాలక్షేపం చేస్తూ – అమ్మ తోడులేని ఆవేదన మర్చిపోతారు!"

"నీ ఆలోచన బాగానే ఉంది. కానీ నువ్వు మాత్రం ఎంతకాలమని ఇక్కడ ఉండగలవ్?"

"నాలుగైదు నెలలుంటే ఆయన మామూలు మనిషవుతారు!"

"మరి అంతవరకూ నీ ఉద్యోగం..." – అంటూ ఇంకా ఏదో అడగబోయాడు మురళి.

"ఫరవాలేదన్నయ్యా! ఈ ఉద్యోగంపోతే అక్కడ మరో 'ప్రాజెక్ట్' ఏదైనా దొరుకుతుందిలే. నాన్న హాయిగా, ఆనందంగా ఉండటం మనకి ముఖ్యం!"

"అదీ నిజమే! ఆయన మనశ్శాంతికంటే మన ఉద్యోగాలు ముఖ్యం కాదు. నువ్వు ఎలా అనుకుంటే అలా చెయ్. నేను అమెరికా వెళ్లాక, ఇక్కడ మీ అవసరాలకు డబ్బు పంపుతాన్లే!"

ఆ తర్వాత చాలా సేపు మళ్లీ ఆ గదిలోంచి మాటలు వినిపించలేదు.

అంతవరకూ వాళ్ల సంభాషణ విన్న శివరామయ్య మనసును మళ్లీ ఆలోచనలు ముసురుకున్నాయి.

ఇప్పుడు ఆ ఆలోచనలన్నీ ఆయన పిల్లల చుట్టూ పరిభ్రమిస్తున్నాయి....!

ఈ రోజుల్లో విదేశాలకు వెళ్లిన పిల్లలు, ఎంత మంది తమ తల్లితండ్రుల్ని ఇంతగా పట్టించుకుంటున్నారూ?

ఎవరిదాకానో ఎందుకూ? ఆమధ్య పక్కింటి రమణయ్యగారు, హఠాత్తుగా గుండెనొప్పితో మరణిస్తే ఆయనగారి ఒక్కగానొక్క కొడుకు అమెరికా నించి ఆరువారాలదాకా రాలేకపోయాడు. పాస్‌పోర్ట్‌లో ఏదో స్టాంపింగ్ లేకపోయిందట. అందుకని రాలేకపోయాట్ట. ఆ తర్వాత వచ్చిన వాడైనా పది రోజులున్నాడా అంటే అదీలేదు. అయిదో రోజునే తిరుగు ప్రయాణమై వెళ్లిపోయాడు...!

కానీ తమ పిల్లలు అలాంటివాళ్లు కాదు. వాళ్ళకు తమపట్ల అపారమైన ప్రేమానురాగాలున్నాయి. అందుకే ఏడాదికోసారి ఒకరితర్వాత ఒకరుగా ఇండియా వచ్చి తమతో కొన్నాళ్లు గడిపి వెడుతున్నారు. ఈ పదేళ్లల్లో రెండుసార్లు తమను వాళ్ళ దేశాలకు తీసుకెళ్లి అక్కడి వింతలూ విశేషాలూ చూపించారు. ఇప్పుడు తమ తల్లి ఎలాగూ బతకదని తెలిసినా ఆమె

వైద్యం కోసం లక్షలకు లక్షలు ఖర్చు చేశారు. మూడు నెలలనించీ ఇండియాలోనే ఉండిపోయి తల్లికి సకల ఉపచారాలూ చేశారు... తనకెంతో ధైర్యం చెప్పారు!

అలాంటి పిల్లల్ని తనకు అందించి ఇప్పుడు ఆ మహా ఇల్లాలు తనువు చాలించబోతోంది.

ఈ ఆఖరి క్షణంలో ఆమెకు కృతజ్ఞతలు తెలుపుకోవటం తన కర్తవ్యంగా భావించాడు శివరామయ్య.

ఆ ఆలోచన రాగానే ఒక్క ఉదుటున మంచం మీదనించి లేచాడు. నెమ్మదిగా అడుగులేస్తూ – పార్వతమ్మ పడుకున్న గదిలోకి నడిచాడు.

మంచంమీద పార్వతమ్మ నిశ్చలంగా పడుకుని ఉంది. అతి నెమ్మదిగా ఎగసిపడుతున్న ఆమె ఛాతి వైపు చూసి సజీవంగానే ఉందని గ్రహించాడు. కృతజ్ఞత చెప్పుకునే అవకాశం లభించినందుకు తృప్తిగా నిట్టూర్చాడు.

నిశ్శబ్దంగా ఆమెను సమీపించిన శివరామయ్య– ఆమె పక్కన కూర్చున్నాడు.

ఆమె నుదుటి మీద ఆప్యాయంగా చేయివేశాడు... ఆ అలికిడికీ, ఆ స్పర్శకూ నెమ్మదిగా కళ్ళు విప్పి చూసింది పార్వతమ్మ...

మాట్లాడేందుకు శక్తిలేక – ప్రశ్నార్థకంగా భర్తవైపు చూసింది.

"నిన్ను ముద్దు పెట్టుకోవాలని వుంది పార్వతీ!"

జీవంలేనట్టుగా నవ్వింది ఆమె.

"ఇంకా... నేను... ముద్దొస్తున్నానా?"– మాటల్ని కూడదీసుకుంటూ అడిగింది...

"వరహాల్లాంటి కొడుకుల్నిచ్చావ్... కన్నతండ్రిగా నేను వాళ్ల ఆలనా పాలనా చూడలేకపోయినా, ఇవాళ వాళ్లు నాకోసం సర్వం త్యాగం చేయటానికి సిద్ధపడుతున్నారు... అంతమంచి పిల్లల్నిచ్చిన బంగారు తల్లివి నువ్వు!... అందుకే, చివరిసారిగా కృతజ్ఞతలు చెప్పుకోని"... అంటూనే ఆమె నుదుటి మీద ఆప్యాయంగా ముద్దు పెట్టుకున్నాడు శివరామయ్య.

పార్వతమ్మ భర్తవైపు తృప్తిగా చూసి నెమ్మదిగా కళ్లు మూసుకుంది... తెల్లవారినా మరి ఆమె కళ్లు తెరవలేదు!!

(ఈనాడు, ఆదివారం)

31-01-1999)